సాక్షి
రంగారెడ్డి
సోమవారం, 19, ఆగస్టు, 2024



సంక్షేమానికి కృషి

ప్రభుత్వం గౌడ కులస్తులతో పాటు, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. 8లో▸



దైవ చింతనతో..

దైవచింతనతో ప్రతిఒక్కరూ మానసికంగా ప్రశాంతంగా ఉంటారని ఎమ్మెల్సీ నాగర కుంట నవీన్‌రెడ్డి అన్నారు. 8లో▸



వైద్య శిబిరానికి స్పందన

చేవెళ్లలో ఆదివారం నిర్వహించిన ఉచిత వినికిడి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 8లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కొత్తూరు: ఆధ్యాత్మికత అల్లుకున్న గ్రామాల్లో ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంపీ డీకే అరుణ అన్నారు. కొత్తూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ ఆలయాల ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలకు ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని వివరించారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాసువాగు రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బడంగ్‌పేట్: కాసువాగు రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆధ్వర్యంలో ఆదివారం నాదర్‌గుల్ కాసువాగు రైతులు ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన సర్వే నంబర్ 613లోని 373 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో తప్పకుండా రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గంజాయి దందా

గచ్చిబౌలి: ఈజీ మనీ కోసం గంజాయి దందాకు పాల్పడిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కటకటాల పాలైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఉప్పరపాలేనికి చెందిన సూరిశెట్టి మహేశ్ ఐటీ కారిడార్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో కంప్యూటర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లోని ఏవీఆర్ శ్రీలక్ష్మీ బాలాజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో గచ్చిబౌలి పోలీసులు, టీ న్యాబ్ అధికారులు హాస్టల్‌పై ఆదివారం మధ్యాహ్నం దాడి చేశారు. మహేశ్ ఉండే గది నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘హైడ్రా’ హడల్



అప్పోజీగూడ పంచాయతీ పరిధిలోని గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో భారీగా అక్రమ నిర్మాణాలు
- సీరియస్‌గా తీసుకున్న హైడ్రా అధికారులు
- కూల్చివేతలు ప్రారంభం
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

మొయినాబాద్: హైడ్రా అధికారులు హడలెత్తిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చి వేస్తున్నారు. నెల రోజులుగా నగరంలోని పలు చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న అధికారులు ఆదివారం మన జిల్లాపై దృష్టి సారించారు. గండిపేట (ఉస్మాన్‌సాగర్) జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భారీ నిర్మాణాలను కూల్చివేశారు. ఉదయం 7 గంటలకే హైడ్రా, జలమండలి అధికారులు పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాల వద్దకు చేరుకుని కూల్చి వేతలు మొదలుపెట్టారు. గండిపేట మండలం ఖానాపూర్, శంకర్‌పల్లి మండలం జనవాడ, మొయినాబాద్ మండం చిలుకూరు రెవెన్యూ పరిధిలోని అప్పోజీగూడ, చిలుకూరు, దేవల్ వెంకటాపూర్ గ్రామాల్లో గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. హైడ్రా చేపట్టిన ఈ చర్యలతో గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల సమీపంలో నిర్మాణాలు చేపట్టినవారు ఆందోళనకు గురవుతున్నారు. తమ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయా అని ఆరా తీస్తున్నారు. హైడ్రా అధికారులు ఎప్పుడు విరుచుకుపడుతారోనని హడలెత్తిపోతున్నారు.

బడాబాబుల నిర్మాణాలే..

గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల సమీపంలో అధిక సంఖ్యలో బడాబాబుల నిర్మాణాలే ఉన్నాయి. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు, ఇతర బడాబాబులకు సంబంధించిన చాలా ఫాంహౌస్‌లు, రిసార్ట్స్ గండిపేట, హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలోనే ఉన్నాయి. హైడ్రా అధికారులు వీటన్నింటినీ గుర్తించి కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న నిర్మాణాలను పలుమార్లు పరిశీలించారు. ఎక్కడి వరకు ఎఫ్‌టీఎల్, ఎక్కడి వరకు బఫర్ జోన్ అనే విషయాలను సర్వే చేసి గుర్తించారు. త్వరలోనే హిమాయత్‌సాగర్ జలాశయం పరిధిలో సైతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల సర్వే నిర్వహిస్తారని సమాచారం. ఇప్పటికే హైడ్రా చర్యలను చాలామంది సమర్థిస్తుండగా కొంతమంది మాత్రం వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా అధికారులు ఇదే విధమైన దూకుడును కొనసాగిస్తే చాలా మంది బడాబాబులకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు నేలమట్టమయ్యే అవకాశం ఉందంటున్నారు.

హైడ్రా చర్యలను స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటానికి హైడ్రా అధికారి రంగనాథ్ చేపడుతున్న చర్యలు సాహసోపేతమైనవి. ఇలాంటి చర్యలను స్వాగతిస్తున్నాం. ఆదిబట్ల, శంషాబాద్, తుక్కుగూడ, మొయినాబాద్, శంకర్‌పల్లి, గండిపేట, 111 జీవో ప్రాంతాల్లో నిర్మాణ కంపెనీలు చెరువులు, కుంటలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాయి. వీటిపైన కూడా చర్యలు తీసుకోవాలి. పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు కబ్జాలు చేసిన భూములను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైడ్రా అధికారి రంగానాథ్‌పై కొంత మంది రాజకీయ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. అలాంటి వారిని ప్రభుత్వం ఉపేక్షించరాదు. కబ్జాలు, ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటల వివరాలను తెలియజేయాలని హైడ్రా కోరుతోంది. ఇప్పటికే కొన్ని వివరాలు ఇచ్చాం. మరిన్ని వివరాలు కూడా తెలియజేస్తాం.

– కాడిగళ్ల భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

అక్రమ నిర్మాణాలపై కొరడా



చిలుకూరు పంచాయతీ పరిధిలోని గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

మొయినాబాద్: అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాలను నేలమట్టం చేస్తున్నారు. గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన భవనాలను ఆదివారం కూల్చివేశారు. మండలంలోని అప్పోజీగూడ, చిలుకూరు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వెస్ట్‌సైడ్ వెంచర్‌లో గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో భవనం సుమారు 500–1000 గజాల్లో మూడు అంతస్తులతో నిర్మించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలతో హైడ్రా, జలమండలి అధికారులు స్పందించారు. పది రోజులుగా అప్పోజీగూడ, చిలుకూరు గ్రామ పంచాయతీల పరిధిలోని గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించారు. ఆదివారం ఉదయం 7 గంటలకే హైడ్రా అధికారులు మల్లికార్జున్, చరణ్, జలమండలి డీజీఎం నరహరి, జలమండలి విజిలెన్స్ అధికారి డీకే లక్ష్మిరెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి భారీ పోలీసు బందోబస్తుతో వెస్ట్‌సైడ్ వెంచర్‌లోకి చేరుకున్నారు. ఇటాచీలు, ప్రొక్లైనర్లతో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనాలను కూల్చివేశారు. అప్పోజీగూడ గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే మూడు భవనాలు, చిలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే ఒక భవనాన్ని కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన క్రికెట్ మైదానాన్ని ధ్వంసం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆత్మీయ ‘రక్ష’

మానవ సంబంధాలు దిగజారిపోతున్న రోజుల్లో రాఖీలాంటి పండుగలు అనుబంధాలను గుర్తు చేస్తున్నాయి. అన్నాచెల్లెళ్ల మధ్య అనురాగాన్ని పెంచి అంతరించిపోతున్న ఆత్మీయ బంధాలకు ఊపిరి పోసే వేడుకే రక్షాబంధన్. ఈ ప్రేమానురాగాల పండగతో తమకు విడదీయరాని బంధం ఉందని పలువులు సోదర సోదరీమణులు పేర్కొంటున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ జరుపుకొనే ఈ ఉత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఈ పర్వదినం కోసం మార్కెట్లో వివిధ వర్ణాలు, ప్రత్యేక ఆకర్షణలతో కూడిన రాఖీలు కొలువుదీరాయి. ఆత్మీయ ఉత్సవం కోసం ఆదివారం తమకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. - వివరాలు 8లో▸

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ శశాంక అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్యాయాన్ని ఎదిరిస్తూ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన పోరాట తెగువ అసమాన్యమైనదని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ బీసీ సంక్షేమ శాఖ అధికారులు, బీసీ సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మొయినాబాద్: సమసమాజం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఓబీసీ సెల్ చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





తెప్పోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

ఘనంగా గంగ తెప్పోత్సవం



వలతో గంగపుత్రుల సందడి

ఖైరతాబాద్: తెలంగాణ గంగ తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఖైరతాబాద్ ఏడు గుడుల దేవాలయం నుంచి గంగ తెప్ప, బోనాల ఊరేగింపు హుస్సేన్ సాగర్ తీరంలోని గంగమ్మ ఆలయం వరకు కన్నుల పండువగా సాగింది. 521 బోనాలు, పోతరాజుల నృత్యాలు, గుస్సాడీ ఆటలు, ఒగ్గు డోలు, వల పందిరితో గంగపుత్రులు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గంగ తెప్పను సాగర తీరంలో వదిలిపెట్టారు. అంతకుముందు ఏడుగుళ్ల దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమం, ఊరేగింపులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్, మాజీ ఎంపీ వీహెచ్, మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫిషరీష్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ కొప్పు పద్మ, పారిశ్రామిక చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కార్పొరేటర్లు విజయారెడ్డి, సంగీతా యాదవ్, మహాలక్ష్మి రామన్‌గౌడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు మాట్లాడుతూ.. గంగ తెప్పోత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని, గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, చెరువులపై గంగపుత్రులకే హక్కులుండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, ఉపాధ్యక్షుడు గుండు జగదీష్ బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి బైరు బాబురావు, కోశాధికారి కాపరనేని లింగం, సురేష్ కుమార్, ఖైరతాబాద్ అధ్యక్షుడు తుమ్మారు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా కొట్టులో గంజాయి చాక్లెట్లు

- విద్యార్థులు, యువతకు విక్రయం
- షాపు యజమాని అరెస్టు



గంజాయి చాకెట్లతో పట్టుబడిన ప్రైవేష్

సాక్షి, సిటీబ్యూరో: కిరాణాకొట్టులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌లోని గోహ్నియా గ్రామానికి చెందిన పివేస్ అలియాస్ ప్రైవేష్ బతుకుతెరువు కోసం కొన్నేళ్ల క్రితం ఐడీపీఎల్ బాలానగర్‌కు వలస వచ్చాడు. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో కిరాణా కొట్టు పెట్టాడు. ఆశించిన మేర ఆదాయం లేకపోవడంతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో తన స్వస్థలమైన యూపీ నుంచి అక్రమంగా గంజాయి చాక్లెట్లను నగరానికి తీసుకొస్తున్నాడు. వీటిని స్కూల్, కాలేజీ విద్యార్థులు, యువత, దినసరి కూలీలకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు కిరాణా కొట్టులో ఆకస్మిక తనిఖీలు చేయగా.. 5 ప్యాకెట్లలో 200 గంజాయి చాక్లెట్లు లభించాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చేనేత సింగారం.. లేలేత వయ్యారం

సాక్షి, సిటీబ్యూరో: మోడళ్లు మెరిశారు. చేనేత చీర కట్టుతో మురిశారు. లేలేత వయ్యారాలతో క్యాట్ వాక్ చేశారు. ఈ నెల 20 నుంచి బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాల్ వేదికగా ‘హ్యాండ్ టు హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శన’ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బేగంపేట కంట్రీ క్లబ్‌లో నిర్వహించిన హ్యాండ్లూం కలెక్షన్ థీమ్ ఫ్యాషన్ షోలో అందాల భామలు చేనేత చీరలు ధరించి హొయలు పోయారు.



గీత కార్మికుల సంక్షేమానికి కృషి


పాపన్నగౌడ్ జయంతి వేడుకలో ఎమ్మెల్యే కసిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాలాజీసింగ్ తదితరులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- చరికొండలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ
- పాల్గొన్న బీజేపీ నేత ఆచారి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: గౌడ కులస్తులతో పాటు, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చరికొండ గ్రామంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక అని కొనియాడారు. పాపన్నగౌడ్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ.. అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పాపన్నగౌడ్ ప్రదర్శించిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీబీ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, సత్యనారాయణ, బాలకృష్ణ, నరేశ్, మహేందర్‌గౌడ్, రాఘవేందర్, రాజీవ్, కిరణ్, గణేశ్, అనిల్, కేఎంగౌడ్, లింగంగౌడ్, కోటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిళ్ల శ్రీనివిస్‌గౌడ్, సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు.

దైవ చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: దైవచింతన అలవర్చుకుంటేనే ప్రతిఒక్కరూ మానసికంగా ప్రశాంతంగా ఉంటారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పృథ్వీకాలనీలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠన మహోత్సవానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో దేవాలయాన్ని నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గొప్ప విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. దేవాలయాలను నిర్మించి వదిలేయవద్దని, నిత్యపూజలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కుమార్‌గౌడ్, సత్యనారాయణ, శంకరయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామంలో రాములు(54) అనారోగ్య సమస్యలతో బాధపడేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్య సమస్యలు అధికం కావడంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి అల్లుడు నరసింహ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చేవెళ్ల: పుట్టుకతో వినికిడి, మూగ లోపం ఉన్న ఆరేళ్లలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఆపరేషన్లు చేసే సౌకర్యం కల్పిస్తోందని ప్రముఖ ఆడియాలసిస్ట్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, డాక్టర్ గోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి ఆసుపత్రిలో డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినికిడి సమస్యలు ఉన్న బాధితులు శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ పరీక్షల్లో పలువురికి చిన్న చిన్న సమస్యలు ఉండగా 20 మంది రోగులకు వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టుకతో చెవిటి, మూగ సమస్యలు ఉన్న 6 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తుందని చెప్పారు. ఇది ఎంతో మంచి నిర్ణయమని దీనిని ప్రజలు గుర్తించి చిన్నతనంలోనే బాగు చేయించుకోవాలన్నారు. బయటయతే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం దుర్గానగర్ చౌరస్తాలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులకు అతను భిక్షాటన చేస్తుండేవాడని తెలియడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

ఖైరతాబాద్: అదుపు తప్పినబీఎండబ్ల్యూ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. ఖైరతాబాద్ ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... ఆదివారం ఉదయం హిమాయత్‌నగర్‌కు చెందిన జితేష్(24) బీఎండబ్ల్యూ కారులో తన స్నేహితురాలు కనిష్క(20), ఆమె సోదరుడు చిరాగ్ శర్మ(14)తో కలిసి బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌కు బయల్దేరారు. కారు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ, తాజ్ దక్కన్ రోడ్డులో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కిందికి రాగానే సన్‌రూఫ్ ఓపెన్ చేసి నిలడిన చిరాగ్ శర్మ కాలు తగిలి, డ్రైవింగ్ చేస్తున్న జితేష్ సీటు బెల్టు ఊడిపోయింది. జితేష్ సీటు బెల్టు పెట్టుకునేందుకు కిందికి వంగిన సమయంలో కారు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మె, విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చిరాగ్ శర్మ ముఖానికి గాయాలయ్యాయి. కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో మిగతా ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాల కోసం మహిళల కప్పాట

శంషాబాద్ రూరల్: వాన దేవుడు కరుణించాలని మహిళలు పాటలు పాడుతూ కప్పాటతో ఊరేగారు. మండలంలోని మల్కారంలో ఆదివారం గ్రామంలో నాగలి దున్నేందుకు వాడే కాడిమాకుకు కప్పలను వేలాడదీసి, వేప కొమ్మలతో అలంకరించి వీధుల్లో తిరిగారు. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు కురవక సాగుకు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రేమానుబంధాలకు ప్రతిరూపం

రక్షగా ఉండాలని సోదరీమణుల బంధనాలు

- తోబుట్టువులతో ఆప్యాయతను పంచుకుంటున్న ఆడపడుచులు
- నేడు రాఖీ పౌర్ణమి

అన్నా చెల్లెళ్ల అనురాగం, అక్కా తమ్ముళ్ల ఆప్యాయతలకు ప్రతిరూపమే రక్షాబంధన్. సోదరులు కష్టకాలంలో తమకు ఆపన్న హస్తం అందించి బాసటగా నిలవాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుంది. అలాగే సోదరులకు ఏ ఆపద కలగొద్దని అనాది నుంచి రాఖీ పౌర్ణమి నిర్వహిస్తున్నారు. ఈ ప్రేమానురాగాల పండగతో తమకు విడదీయరాని బంధం ఉందని జిల్లాలోని పలువులు సోదర సోదరీమణులు పేర్కొంటున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అవి మీ కోసం..

– సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: రాఖీలు కొనుగోలు చేస్తున్న అతివలు


ఇబ్రహీంపట్నం: రాఖీలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు


చేవెళ్లలో: ఓ దుకాణంలో పిల్లల కోసం ప్రత్యేక రంగుల్లో ఉన్న రాఖీలు


మొయినాబాద్: షాపులో రాఖీలు కొంటున్న మహిళలు


కడ్తాల్: రాఖీలు కొనుగోలు చేస్తున్న ఆడపడుచులు

సందడే..సందడి

యాచారం: రాఖీ అంటే మాకు పెద్ద సంబురం. ఏ పండుగకు చెల్లెల్లు రాకున్నా రాఖీ రోజు నలుగురు చెల్లెల్లు, వారి పిల్లలు, మా పిల్లలతో ఇల్లు మొత్తం సందడిగా ఉంటుంది. నేను బీఎన్‌రెడ్డినగర్‌లో ఉంటునప్పటికీ రాఖీ రోజు మా స్వగ్రామం చౌదర్‌పల్లికి వెళ్తాను.

– జుట్టు శ్రీశైలంకుర్మ, చౌదర్‌పల్లి, రియల్ వ్యాపారి


చౌదర్‌పల్లిలో చెల్లెళ్లతో రాఖీ కట్టించుకుంటున్న శ్రీశైలం (ఫైల్)

ఉపాధ్యాయులే మాకు రక్ష

పెద్దేముల్: అనాథ విద్యార్థులకు ఉపాధ్యాయులే సోదరులయ్యారు. మండలంలోని మారెపల్లి శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో వైష్ణవి, అశ్విని, పూజ, వైష్ణవి, గంగుభాయ్ అనే విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో రాఖీ పండుగకు ఇంటికి వెళ్లలేని పరిస్థితి. దీంతో తమకు విద్యాబుద్ధులు నేర్పిన సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు ఉమారాణికి విద్యార్థులు ఆదివారం రాఖీ కట్టి రక్షగా ఉండాలని కోరారు.


ఉపాధ్యాయురాలికి రాఖీ కడుతున్న అనాథ విద్యార్థులు

ఎక్కడ ఉన్నా మరిచిపోదు

తాండూరు రూరల్: నాకు ఇద్దరు అక్కలు. ఒకరు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి, మరొకరు సద్గుణ గృహిణి. ముఖ్యంగా అక్క సబితారెడ్డి రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా పండుగకు ఇంటికి వచ్చి నాకు రాఖీ కడుతుంది. ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా తమ్ముడిని మరవదు. చిన్నప్పుడు మా అక్కలు నాపై చూపిన ప్రేమను మరిచిపోను. ఎమ్మెల్యేగా సబితారెడ్డి తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే సోదరుడికి సైతం ప్రాధాన్యం ఇస్తారు.

– మాజీ మంత్రి సబితారెడ్డి సోదరుడు నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి (ఫైల్)

అంతరాలు దాటిన అనుబంధం

తలకొండపల్లి: సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతిరూపమే రాఖీ పండుగని మాజీ ఎంపీపీ తిర్మణీ నిర్మలా శ్రీశైలంగౌడ్ అన్నారు. ఏ బంధుత్వం లేకపోయినా సోదరుడు, సోదరి అనే భావన ఉన్న ప్రతిఒక్కరూ రక్షాబంధనాన్ని కట్టి వారి క్షేమాన్ని కోరవచ్చన్నారు. అందుకు చిహ్నంగా ఏటా మాజీ ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్‌గుప్తాను అన్నగా భావించి, ఆయన ఇంటికి వెళ్లి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటారు.


వెంకటేశ్‌గుప్తాకు రాఖీ కడుతున్న నిర్మల (ఫైల్)

విధుల్లో ఉన్నా రాఖీ కడుతా

పరిగి: మా తమ్ముడు నేను కవలలం. తను ఎక్కడ విధుల్లో ఉన్నా రాఖీ రోజు తప్పకుండా కడుతా. తను వృత్తి రీత్యా పోలీస్ కానిస్టేబుల్. ఎక్కడ ఉన్నా సరే రాఖీ కడితేనే సంతృప్తి. తన విధుల్లో ఉన్నా రాఖీ కట్టేందుకు వెళ్తా.

– సుభాషిణి, పరిగి


తమ్ముడికి రాఖీ కడుతున్న సుభాషిణి (ఫైల్)

తమ్ముడు లేని లోటు తీరింది!

దుద్యాల్: మేము ఇద్దరం అక్కాచెల్లెలం నవీన, రిషిక, తమ్ముడు భౌతిక్ ఉండేవాళ్లం. 2017లో మా తమ్ముడు ఆరోగ్య సమస్యతో దూరమయ్యాడు. అప్పటి నుంచి రాఖీ పండుగకు దూరంగా ఉండేవారం. రాఖీ కట్టడానికి తమ్ముడు లేడనే బాధ మాలో ఉండేది. కానీ మా పెదనాన్నకు, చిన్ననాన్నకు పుత్ర సంతానం కలగడంతో తమ్ముడు లేని లోటు తీరింది. వారికి రాఖీలు కట్టి పండుగ చేసుకుంటున్నాం.

– నవీన, ఇంటర్ విద్యార్థి, హస్నాబాద్


పెదనాన్న కొడుక్కి రాఖీ కడుతున్న నవీన (ఫైల్)

ఎకో రాఖీని ఆదరిద్దాం

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్టలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి పర్యాటకులకు ఏకో రాఖీలు పంచిపెట్టారు. దీర్ఘాయుష్ అనే సంస్థతో కలిసి ప్రకృతిని కాపాడాలంటూ ఆవు పేడతో తయారు చేసిన రాఖీలను టూరిస్టులకు అందించారు. ప్రకృతిని కాపాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో అక్కడున్న ప్రజలకు వివరించారు.

– విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, తాండూరు


పర్యాటకులకు ఎకో రాఖీలు పంపిణీ చేస్తున్న మాజీ చైర్‌పర్సన్

యూఎస్ నుంచి పంపించాను

మాది వికారాబాద్ పట్టణం. నేను తమ్ముడికి ప్రతిసారి నేరుగా రాఖీ కడతాను. ఈ ఏడాది మాత్రం ఉన్నత చదువుల కోసం యూఎస్ వచ్చాను. తమ్ముడిని చాలా మిస్ అవుతున్నా. ప్రస్తుతం రాఖీని కొరియర్‌లో పంపిస్తున్నా. రాఖీ పండుగ వచ్చిందంటే మా ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది.

– వైష్ణవిగౌడ్, స్టూడెంట్, యూఎస్



అనుబంధానికి ప్రతీక

అనంతగిరి: అన్నా చెల్లెళ్లు– అక్కా తమ్ముళ్ల జరుపుకొనే మహోత్తరమైన పండుగ రక్షాబంధన్ అని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఓం శాంతి భవనంలో జరిగిన రక్షా బంధన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మధు అక్కయ్య స్పీకర్‌కు తిలకం దిద్ది రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. తమ సోదరుడు సుఖ సంతోషాలతో మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ కట్టేదే రాఖీ పండుగ అన్నారు. నాకు అక్కచెల్లెళ్లు ఉన్నారని, నేను ఒక్కడినే సోదరున్ని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, డీసీఎంఎస్ మాజీ మేనేజర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మధుఅక్కయ్య

పోస్టులో పంపిస్తాం

పరిగి: మా తమ్ముడు దండు శ్రీనివాస్ ఆర్మీలో ఉద్యోగం చేస్తూ కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. దేశ రక్షణకోసం బార్డర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మేము ఇద్దరం అక్కలం. మా తమ్ముడికి ప్రతీ సంవత్సరం పోస్టు ద్వారా రాఖీ పంపిస్తున్నాం. 14 సంవత్సరాలు పోస్టు ద్వారానే పంపించాం. పది రోజుల ముందు రాఖీ పంపించి సమాచారం అందజేస్తాం. తమ్ముడు రాఖీ కట్టుకుని అక్క చెల్లెల బంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆరోజు ఆనందంగా ఉంటాడు.

– భాగ్యలక్ష్మి, కుల్కచర్ల, పరిగి



బెట్టింగ్‌లో చీటింగ్

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ రేస్ క్లబ్ ఆఫ్ కోర్స్ టోట్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని ఖైరతాబాద్ పోలీసులు గేమింగ్ యాక్ట్ కింద అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఖైరతాబాద్‌లోని రేస్ క్లబ్‌లో బెట్టింగ్ చేయాలంటే టికెట్ తీసుకొని నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. కానీ, కాచిగూడకు చెందిన మహేష్ (69), మల్లేపల్లికి చెందిన హసద్ అహ్మద్(36) నిబంధనలకు విరుద్ధంగా గ్యాంగ్‌గా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సెక్యూరిటీ సూపర్‌వైజర్ షా నవాజ్ గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా మహేశ్, హసద్‌తోపాటు బెట్టింగ్ ముఠాలోని సాయిలు (36), షేక్ అక్బర్ (48)లను అదుపులోకి తీసుకున్నారు.